www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
నిపుణ I పోటీపరీక్షల ప్రత్యేకం
సోమవారం 4-3-2024
నిపుణ
నమస్తే తెలంగాణ
Telangana Today

# కడివెండి గ్రామం..సాయుధ పోరుకు మూలం




## హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్రోద్యమం

- తెలంగాణలో వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, ఆత్మకూర్, దోమకొండ, సిర్నపల్లి, పాల్వంచ, అల్లాదుర్గం ముఖ్యమైన జమీందారీ సంస్థానాలు. ఈ సంస్థానాల కింద వందల కొద్ది గ్రామాలుండేవి.
- జాగీర్దారులు, దొరలు, దేశ్‌ముఖ్‌లు గ్రామాల్లో ఇష్టం వచ్చినట్లు పాలించేవారు. పన్నుల భారం మోపేవారు.
- ప్రజాస్వామిక వ్యవస్థలైన శాసనసభలు, స్థానిక సంస్థలు లేవు.
- హైదరాబాద్ రాజ్యాన్ని బ్రిటిష్ వైస్రాయ్‌కి లోబడి నిజాం పరిపాలన చేసేవాడు. నిజాంను రెసిడెంట్ అనే ఆంగ్లేయ అధికారి నియంత్రించేవాడు.
- హైదరాబాద్ రాజ్యంలో జాతీయ కాంగ్రెస్ గురించి తెలపడానికి ఒక బృందం సమావేశం, ప్రదర్శన నిర్వహించింది.
- అఘోరనాథ చటోపాధ్యాయ ప్రభావంతో చాలామంది విద్యావంతులు కాంగ్రెస్ పట్ల ఆకర్షితులయ్యారు.
- కాంగ్రెస్ కార్యకలాపాల్లో హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ ఖయ్యూం చాలా చురుకుగా పాల్గొన్నాడు. అంజుమన్-ఎ-మారెఫ్ అనే సంస్థను ఇతను స్థాపించాడు.
- హైదరాబాద్ రాజ్యంలో జాతీయవాదాన్ని సమర్థించిన పత్రికలు -హైదరాబాద్ టెలీగ్రాఫ్, దక్కన్ స్టాండర్డ్, ముస్లిం-ఇ-సఫీక్
- చాదర్ ఘాట్ మెథడిస్ట్ ఎపిస్కోపల్ చర్చికి చెందిన రెవరెండ్ గిల్డర్ వంటి క్రైస్తవ మత బోధకులు కూడా కాంగ్రెస్‌ను బలపరిచారు.
- 1892లో హైదరాబాద్‌లో ఆర్యసమాజ్ స్థాపించబడినది. ఇది సామాజిక మత చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేసింది. హైదరాబాద్‌లో జాతీయోద్యమానికి అనేక మంది నాయకులను అందించింది.

## రాష్ట్రంలో ఫ్యూడల్ వ్యవస్థ

- నిజాంలు మొదట్లో మొఘల్ చక్రవర్తుల దగ్గర ప్రాంతీయ గవర్నర్లుగా ఉండేవారు. వంశపారంపర్యంగా కొనసాగే జాగీర్దారులు, చిన్న చిన్న సంస్థానాలు సామంత రాజుల హయాంలో పాలనను సాగించారు. రాజ్యంలో మిగిలిన ప్రాంతాన్ని దొరల సహాయంతో నిజాంలు నేరుగా పాలించేవారు.
- రాజులు వారి వంశస్థులు అన్ని వనరులను నియంత్రిస్తూ వారి ఇష్టం వచ్చినట్లు పాలించే పాత వ్యవస్థనే కొనసాగించాలని నిజాంకి ఉండేది.
- స్థానిక సంస్థలు, శాసనసభలు వంటి ప్రజాస్వామిక వ్యవస్థలను వారు అనుమతించలేదు.
- కాంగ్రెస్ నేతృత్వంలోని జాతీయోద్యమాన్ని 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ వ్యతిరేకించేవారు. రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలను నిషేధిస్తూ అనేక ఫర్మానాలు (రాజాజ్ఞలు) జారీ చేశారు.
- పోలీస్, నిఘా వ్యవస్థలను ఏర్పరచి ప్రజలను నిరంతరం దగ్గరగా పరిశీలించేవారు.

## భాషా మతం

- హైదరాబాద్‌ను పాలించిన నిజాంలు ముస్లింలు వారు దక్కనీ ఉర్దూను పాలనా భాషగా పాటించేవారు.
- అయితే ఎక్కువ మంది హిందువులు తెలుగు, కన్నడ, మరాఠీ మాట్లాడేవారు.
- బాలగంగాధర్ తిలక్ నేతృత్వంలో అతివాద జాతీయోద్యమ కాలంలో జాతీయోద్యమం మతపరమైన మలుపు తిరిగింది. హైదరాబాద్‌ను కూడా ప్రభావితం చేసింది.
- ఈ కాలంలో భాష, మతం ప్రధానాంశాలు అయ్యాయి. ఉర్దూ అధికార భాషగా ఉండేది. నాడు తెలుగు భాషా ఉద్యమం తెలంగాణ ప్రజల ఆకాంక్షగా మారింది.
- అధికార భాష ఉర్దూ, విద్యా సంస్థల్లో బోధనా భాష ఉర్దూ.
- నిజాం అధికారుల్లో 90 శాతం మంది ముస్లింల అధికార భాష ఉర్దూ, ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు బోధనా మాధ్యమంగా ఉర్దూ ఉండేది.
- నిజాంలు హైదరాబాద్ రాజ్యంలో విద్యను నిరుత్సాహపరిచారు. పాఠశాలల స్థాపననూ నిరుత్సాహపరిచారు. అందువల్ల అక్షరాస్యత శాతం తక్కువగా ఉండేది. ఉదాహరణకు

| పట్టణాలు | అక్షరాస్యత |
|---|---|
| హైదరాబాద్ | 9.3 శాతం |
| ట్రావెన్‌కోర్ | 47.7 శాతం |
| బరోడా | 23 శాతం |
| మైసూర్ | 12.2 శాతం |

- హైదరాబాద్ మహిళల్లో అక్షరాస్యత కేవలం 4.3 శాతం మాత్రమే
- ఫలితంగా 1941 నాటి నిజాం రాజ్యంలో విద్యావంతుల శాతం మిగతా స్వదేశీ రాజ్యాల కంటే తక్కువగా ఉన్నది.

## చివరి నిజాం (1911-1948)

- హైదరాబాద్ రాజ్య చివరి పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ బ్రిటిష్ వారి ప్రభావం వల్ల పరిపాలననూ ఆధునికీకరించాడు.
- ప్రఖ్యాత ఇంజినీర్ ఎం. విశ్వేశ్వరయ్య నిజాంసాగర్, అలీసాగర్‌లకు రూపకల్పన చేశాడు.
- నిజాం పారిశ్రామికాభివృద్ధికి రూ. కోటి తో నిధి ఏర్పాటు చేశాడు. ఇతని కాలంలో స్థాపించిన కర్మాగారాలు- సింగరేణి, నిజాం షుగర్స్, ఆజంజాహీ మిల్స్, సిర్పూర్ పేపర్ మిల్.
- 1941లో నిజాం హైదరాబాద్ స్టేట్ బ్యాంక్‌ను స్థాపించాడు. ఇప్పుడది స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌గా పిలువబడుతుంది. ఇది నాడు నిజాంకు కేంద్ర బ్యాంక్‌గా ఉండేది.
- హైదరాబాద్ రాష్ట్ర రూపాయి ఉస్మానియా సిక్కా సొంత నాణేలు, రూపాయలు కలిగిన ఏకైక స్వదేశీ రాజు నిజాం.
- ఇతను నిర్మించిన నిర్మాణాలు - ఉస్మానియా ఆస్పత్రి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైకోర్టు రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, యునాని ఆస్పత్రి, జూబ్లీహిల్స్, టౌన్ హాల్ (అసెంబ్లీ భవనం), హైదరాబాద్ మ్యూజియం, ఢిల్లీలో హైదరాబాద్ భవనం.
- 1914లో పురావస్తు శాఖను ఏర్పాటు చేశాడు.
- 1947లో బ్రిటిష్ వారు వెళ్లిన తర్వాత ఇతను స్వతంత్రంగా ఉండాలని కోరుకోగా ప్రజలు భారతదేశంలో విలీనం కావాలని భావించారు.
- హైదరాబాద్ రాజ్యంలో తెలుగు భాషకు సరైన స్థానం గౌరవం కోసం ఆంధ్రజన సంఘం కృషి చేసింది.

## ఆంధ్రజన సంఘం - గ్రంథాలయోద్యమం

- 1921లో హైదరాబాద్‌లో వివేక వర్ధిని కళాశాలలో తెలుగు భాషలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టడానికి ప్రయత్నించిన ఒక వ్యక్తి అవమానించబడ్డాడు.
- 1921లో మాడపాటి హనుమంత రావు మరికొందరితో కలిసి ఆంధ్ర జన సంఘాన్ని ఏర్పాటు చేశాడు. తెలుగు భాషను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం.
- ఈ జన సంఘం ద్వారా 4000 పాఠశాలలను స్థాపించారు. కానీ నిజాం వ్యతిరేకత వల్ల వాటిలో చాలా మూతపడ్డాయి.
- ఈ జన సంఘం కంటే ముందు 1901లో హైదరాబాద్‌లో కొమర్రాజు లక్ష్మణరావు, నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించారు. ఇది తెలంగాణలో తొలి గ్రంథాలయం.

## ఆంధ్ర మహాసభ

- 1930లో ఆంధ్ర మహాసభ (AMS) ఏర్పడింది. దీని స్థాపకుల్లో మాడపాటి హనుమంతరావు, రావి నారాయణ రెడ్డి ముఖ్యులు
- గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి ప్రజల్లో జాతీయతా భావాలు రగిల్చాడు.
- కాళోజీ నారాయణరావు దాశరథీ కృష్ణమాచార్య, దాశరథీ రంగాచార్య మొదలైన వారు హైదరాబాద్ స్వాతంత్ర్యం కోసం పోరాడారు.
- పాఠశాలలు ఏర్పాటు చేయమని, ప్రజల సమస్యలు పరిష్కరించమని కోరుతూ వారు ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించారు. 1935లో జరిగిన వార్షిక సమావేశంలో ప్రభుత్వాన్ని కింది డిమాండ్‌లు నెరవేర్చాలని కోరారు.

  1) నిర్బంధప్రాథమిక విద్యను అమలు చేయాలి.
  2) మాతృభాష (తెలుగు)లో విద్యాబోధన జరగాలి
  3) జాగీర్ ప్రాంతాల్లో ప్రజల చట్టబద్ధ హక్కులకు రక్షణ కల్పించాలి
  4) బాల్య వివాహాలను నిరోధించాలి
  5) అంటరానితనాన్ని నిషేధించాలి.
- కొద్ది కాలంలో ఆంధ్రమహాసభ తెలంగాణ అంతటా ఆదరణ పొందింది. 1940 నాటికి దీనిలో చాలా మంది కమ్యూనిస్టులు చేరారు.
- వెట్టిని అంతం చేయడం, భూ సంస్కరణలు, దొరల దోపిడీ వంటి అంశాలు చేపట్టాలని వారు పట్టుబట్టారు.
- ఆంధ్ర మహాసభలోని పాతతరం నాయకులు కమ్యూనిస్టుల భావాలను వ్యతిరేకించి బయటకు వచ్చారు.

## హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్

- స్వదేశీ రాజ్యాల్లో రాష్ట్ర కాంగ్రెస్‌ల ద్వారా జాతీయ కాంగ్రెస్ పోరాటాలు సాగించేది.
- 1938లో హైదరాబాద్ నిజాం 'వందేమాతరంను నిషేధించాడు. దీన్ని నిరసిస్తూ విద్యార్థులు వందేమాతర ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ స్పందనను గమనించిన హైదరాబాద్‌లోని జాతీయవాదులు 1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌ను స్థాపించారు.
- దీని ముఖ్య నాయకులు స్వామి రామానందతీర్థ, వి. రామకిషన్‌రావ్, జమలాపురం కేశవరావు, కె.వి. రంగారెడ్డి, జె.వి. నరసింగరావు
- యువ కాంగ్రెస్ నాయకులైన మర్రి చెన్నారెడ్డి తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కాగా, పి.వి. నరసింహారావు దేశ ప్రధాన మంత్రి అయ్యారు.
- 1942లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కూడా సత్యాగ్రహాన్ని ప్రారంభించింది.

## తెలంగాణ సాయుధ పోరాటం (1946-51)

- 1929 నుంచి పటేల్ పట్వారీలు, దేశ్‌ముఖ్‌లు, రెవెన్యూ పోలీస్ అధికారులు దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడటానికి నల్లగొండ పిల్లలమర్రి, కరీంనగర్ ప్రాంతాల్లో రైతు సంఘాలు ఏర్పడ్డాయి.
- ఆంధ్రమహాసభ కిసాన్ సభల్లో పనిచేస్తున్న కమ్యూనిస్టులు 1946 నాటికి వాటి నాయకత్వాన్ని చేజిక్కించుకున్నారు. దున్నే వాడికి భూమి అంటూ విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టారు.
- నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఆంధ్రమహాసభ గ్రామ స్థాయిల్లో శాఖలను ఏర్పాటు చేసింది. ఈ శాఖలు సంఘంగా పేరు పొందాయి. ఈ సంఘాలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది.
- విస్నూరు రామచంద్రారెడ్డి అనే జమీందారు చాకలి ఐయిలమ్మ భూములను బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నించగా సంఘం దీన్ని తిప్పి కొట్టింది.
- మొదట్లో చట్ట విరుద్ధ ఫ్యూడల్ దోపిడీ లెవీ విధానాలను అధిక భూమి శిస్తులను కౌలుదారులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ వెట్టిని నిర్మూలించాలని కోరుతూ రైతాంగం ఉద్యమించింది. గ్రామీణ సమాజంలోని అన్ని వర్గాలను దొరలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో భాగస్వాములను చేయటానికి ప్రయత్నించారు.
- లెవీ వసూళ్లను వ్యతిరేకిస్తూ విస్నూర్ రామచంద్రారెడ్డి అకృత్యాలపై ఆంధ్రమహాసభ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. అధికారులు విచారణకు వచ్చినప్పుడు కొంత గందరగోళం చెలరేగింది.
- లెవీ ధాన్యంలో తాను చేసిన అవకతవకలు అధికారుల దృష్టికి రాకుండా రామచంద్రారెడ్డి హింసను సృష్టించి విచారణ కొనసాగకుండా చేయాలని ప్రయత్నించాడు.
- దొడ్డి మల్లయ్య నాయకత్వంలో ఆంధ్ర మహాసభ కార్యకర్తలు గడి ముందు నుంచి వెళ్తున్నారు. అయితే వారు దాడి చేయడానికి వస్తున్నారని వారిపై కాల్పులకు రామచంద్రారెడ్డి ప్రయత్నించాడు.
- 1946 జూలై 4న కడివెండి గ్రామంలో రైతుల ప్రదర్శనలపై జమీందారు కాల్పులు జరిపించగా దొడ్డి కొమరయ్య అమరుడయ్యాడు. కాల్పులు జరిపినది మిస్కిన్ అలీ.
- ఈ సంఘటనతో తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమైంది. సంఘం సాయుధ దళాలను నిర్మించుకొని నిజాం దొరలు, జమీందార్లపై సాయుధ పోరాటం ప్రారంభించింది. నల్లా నర్సింహులు వెట్టి నుంచి విముక్తి అయిన వారితో దళాలు ఏర్పాటు చేశారు.
- సంఘాలు సమాంతర ప్రభుత్వాన్ని ప్రజా న్యాయ స్థానాలను నిర్వహించాయి. నల్లగొండ, వరంగల్‌లో నిజాం స్వతంత్ర భారతదేశంలో విలీనం చేయాలని కోరారు. ఉద్యమ పరిధిని పెంచి అన్ని వర్గాలను కలుపుకొని విశాలాంధ్ర ఏర్పాటు చేయాలని పోరాడారు.

**తెలుగు అకాడమీ సౌజన్యంతో**